ప్రజాశక్తి
శనివారం 7 జూన్ 2025
5
విజయనగరం



20న తపాలా అదాలత్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విశాఖపట్నం పోస్టల్ రీజియన్ పరిధిలోని వినియోగదారుల వ్యక్తిగత, సమస్యలను పరిష్కరించేందుకు ఈ నెల 20న 118వ తపాలా అదాలత్ నిర్వహిస్తున్నట్టు విశాఖపట్నం రీజియన్ అసిస్టెంట్ డైరెక్టర్ కెవిడి సాగర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 10.30 గంటలకు విశాఖపట్నం ఎంవిపి కాలనీలోని పోస్టుమాస్టర్ జనరల్ కార్యాలయంలో ఈ అదాలత్ జరుగుతుందని తెలిపారు. తపాలా సర్వీసులకు సంబంధించి ప్రత్యేక, వ్యక్తిగత ఫిర్యాదులను మాత్రమే ఈ అదాలత్‌లో చర్చిస్తామని తెలిపారు. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాల పరిధిలోని తపాలా వినియోగదారులు ఈ అదాలత్‌కు హాజరు కావచ్చునని తెలిపారు. అదాలత్ కు హాజరయ్యేవారు తమ సమస్యలను ఈ నెల 16లోగా తపాలా అదాలత్ అన్న శీర్షికతో, విశాఖపట్నం ఎంవిపి కాలనీలోని తమ కార్యాలయానికి ధరఖాస్తు పంపించాలని ఆయన సూచించారు. గడువు దాటిన తరువాత వచ్చే దరఖాస్తులను స్వీకరించబోమని తెలిపారు.

పకడ్బందీగా డిఎస్‌సి పరీక్షలు

8.15 గంటలకే లోపలికి అనుమతించిన సిబ్బంది ● పరీక్షా కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్ అంబేద్కర్

పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఎన్నో ఏళ్ల నుంచి ఎదురు చూస్తున్న ఉపాధ్యాయ అర్హత పరీక్ష డిఎస్‌సి కట్టుదిట్టమైన ఏర్పాట్లు మధ్య శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమైంది. జిల్లాలో 583 ఉపాధ్యాయ పోస్టులకు సుమారు 36,495 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఉమ్మడి జిల్లాలో సీతం కాలేజీలోని ఐయాన్ ఐయాన్ డిజిటల్‌సెంటర్, లెండి ఇంజినీరింగ్, ఎంవిజిఆర్ ఇంజనీరింగ్, అవంతి కళాశాలల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసారు. ఆన్‌లైన్ విధానంలో ఉదయం 9.30 నుంచి 12 గంటలు వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటలు వరకు రెండు పూటలా పరీక్ష జరిగింది. నిమిషం ఆలస్యమైనా అనుమతించేది లేదని అధికారులు ప్రకటించడంతో అభ్యర్థులు ఉదయం ఉదయం 8 గంటలకే కేంద్రాలకు చేరుకున్నారు. ముందుగా హాల్ టికెట్లను పరిశీలించిన సిబ్బంది 8.15 నిమిషాలకు అభ్యర్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతించారు. ప్రతి అభ్యర్థిని క్షుణ్ణంగా తనిఖీ చేసి,ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించకుండా చర్యలు తీసుకున్నారు. ఎన్నో ఆశలతో ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న అభ్యర్థులు ఆనందంగా పరీక్ష రాసేందుకు వెళ్లారు. కొంతమంది మహిళా అభ్యర్థులు చిన్న పిల్లలను వెంట బెట్టుకుని రావడంతో వారి భర్తలు పిల్లల సంరక్షణ చూసుకుంటూ బయట వేచి ఉన్నారు.

పకడ్బందీగా నిర్వహించాలి : కలెక్టర్

డిఎస్‌సి పరీక్షలను పకడ్బంధీగా నిర్వహించాలని అధికారులను జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశించారు. స్థానిక అయాన్ డిజిటల్ పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. అభ్యర్థులకు అక్కడ కల్పించిన వసతులను, పరీక్ష నిర్వహణను, బందోబస్తును పరిశీలించారు. అభ్యర్థులకు ఏమాత్రం ఇబ్బంది కలగకుండా అన్ని వసతులను కల్పించాలని ఆదేశించారు. అప్రమత్తంగా ఉండి, అవసరమైన వారికి మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేయాలని వైద్య శిబిరం సిబ్బందికి సూచించారు. కలెక్టర్ వెంట డిఈఓ యు.మాణిక్యంనాయుడు, ఇన్‌ఛార్జి తాహశీల్దార్ స్వర్ణకుమార్, ఇతర అధికారులు, సిబ్బంది ఉన్నారు.

పరీక్షా కేంద్రం వద్ద హాల్‌టికెట్ నంబర్లను చూసుకుంటున్న అభ్యర్థులు

రూ.13,444 కోట్లతో రుణప్రణాళిక

రుణాల మంజూరులో శత శాతం లక్ష్యాలను చేరాలి : కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్

ప్రజాశక్తి-కంటోన్మెంట్

2025-26 ఆర్థిక సంవత్సరానికి 13,444 కోట్ల రూపాయలతో వార్షిక రుణప్రణాళికను జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విడుదల చేసారు. గత ఏడాది కన్నా 19.20శాతం అదనంగా ఈ ఏడాది పెంచినట్లు తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి బ్యాంకర్ల సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈఏడాది రుణ ప్రణాళికలో వ్యవసాయానికి రూ.8,025కోట్లను కేటాయించామన్నారు. ఎంఎస్ఎంఇ కింద ముద్ర, స్టార్టప్ ఇండియా, స్టాండ్ అప్ ఇండియా రుణాల కోసం 1,843 కోట్లను కేటాయించినట్లు తెలిపారు. విద్య, గృహ నిర్మాణ రంగాలకు 282 కోట్లను కేటాయించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బ్యాంకర్లు లక్ష్యాలకు తగ్గట్టుగా శత శాతం రుణాలు అందజేయడానికి ముందుకు రావాలని తెలిపారు. ఈ ఏడాది రూ.140 కోట్లు పంట రుణాలుగా అందించాలనే లక్ష్యంతో పని చేస్తున్నామని తెలిపారు. ఈ ఖరీఫ్ లో వరి సాగును పెంచడానికి చర్యలు తీసుకున్నామని, ముందే వర్షాలు పడడంతో ప్రస్తుతం జిల్లాలో వర్షపాతం అధికంగా నమోదైందని, పంటకు రైతులను ముందుగానే సిద్ధం చేయాలని తెలిపారు. నవంబర్‌లో తుఫాన్లు వచ్చే అవకాశం ఎక్కువని, అక్టోబర్ నాటికే వరి పంట కోతలయ్యేలా ప్రణాళి కలు వేసు కోవాలని తెలిపారు. అందుకోసం బ్యాంకర్లు జూలై లోపలే రుణాలు మంజూరు చెయ్యాల్సి ఉంటుందని అన్నారు. సిసిఆర్‌సి కార్డులను వెంటనే బ్యాంక్‌లకు పంపాలని జిల్లా వ్యవసాయ అధికారికి ఆదేశించారు. పి.ఎం.విశ్వకర్మ క్రింద అందిన దరఖాస్తులకు వేగంగా రుణాలు అందేలా చూడాలన్నారు. ఈ పథకం కింద ఇంతవరకు 86,386 దరఖాస్తులు అందగా స్టేజి 3 వెరిఫికేషన్ అనంతరం 6182 దరఖాస్తులను ఆమోదించినట్లు తెలిపారు. వీరిలో 5057 మందికి బేసిక్ స్కిల్ ట్రైనింగ్ పూర్తి చేశామన్నారు. బ్యాంకులకు 3805 దరఖాస్తులను పంపగా 1080 మందికి రూ.6.86 కోట్లు రుణాలు మంజూరయ్యాయని, మిగిలిన వారికి రుణాలను వేగంగా అందేలా చూడాలని తెలిపారు. సమావేశంలో ఎల్.డి.ఎం రమణమూర్తి, నాబార్డ్ డిడిఎం నాగార్జున, జిల్లా అధికారులు, పలు బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న బ్యాంకర్లు

మాట్లాడుతున్న కలెక్టర్ అంబేద్కర్

గాయపడిన వారిని 108లో తరలిస్తున్న సిబ్బంది

ఉపాధి కూలీలపై కందిరీగల దాడి

11 మందికి అస్వస్థత

ప్రజాశక్తి-రేగిడి

మండలంలోని కె.వెంకటాపురం గ్రామంలో శుక్రవారం ఉపాధి హామీ పనులు చేపడుతున్న కూలీలపై కందిరీగలు దాడి చేశాయి. దాడిలో 11 మంది అస్వస్థతకు గురయ్యారు. వేతనదారులు పనులు చేస్తుండగా ఒక్కసారిగా కందిరీగలు దాడి చేశాయి. దీంతో కూలీలు పరుగులు తీశారు. ఈ ఘటనలో అప్పారావు, సుబ్బయ్య, బట్న జగన్నాథం, ఇందారపు రత్నాలమ్మ, వెంపటాపు సూర్యనారాయణ, వెంపటాపు శిమ్మలు, రమణ, బట్న రాజేష్, అరసవల్లి గౌరమ్మ, అరసవల్లి దుర్గారావు, అరసవల్లి బుచ్చమ్మ, కింజరాపు ఇందిరమ్మ అస్వస్థతకు గురయ్యారు. ఇందులో కింజరాపు ఇందిరమ్మ పరిస్థితి విషమంగా ఉంది. 108 సిబ్బంది అక్కడికి చేరుకుని, ప్రథమ చికిత్స చేశారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రులు చికిత్స పొందుతున్నారు.

సముద్రతీరంలో భారీ యోగా ప్రదర్శన

- కిటకిటలాడిన చింతపల్లి బీచ్
- యోగా నిత్యజీవితంలో భాగం

కావాలి : కలెక్టర్ అంబేద్కర్

యోగాసనాలు వేస్తున్న అధికారులు, నాయకులు, ప్రజలు

ప్రజాశక్తి-పూసపాటిరేగ

శారీరక, మానసిక ఆరోగ్యం కోసం ప్రతీఒక్కరూ యోగా అలవర్చుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోరారు. ప్రతీ వ్యక్తి నిత్య జీవితంలో యోగా ఒక భాగం కావాలని ఆయన పిలుపునిచ్చారు. పర్యాటక ప్రదేశాల్లో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా, ప్రముఖ పర్యాటక ప్రాంతం చింతపల్లి సముద్ర తీరంలో శుక్రవారం ఉదయం భారీ యోగా ప్రదర్శన నిర్వహించారు. వందలాదిమంది ఈ కార్యక్రమానికి హాజరు కావడంతో బీచ్ కిటకిటలాడింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మానసిక ప్రశాంతతకు, శారీక ఆరోగ్యానికి యోగా ఒక దివ్య ఔషదమని పేర్కొన్నారు. యోగావల్ల వివిధ రకాల జీవనశైలి వ్యాధులను దూరం చేసుకోవచ్చునని సూచించారు. యోగా గొప్పదనాన్ని, ప్రయోజనాలను వివరించేందుకు ప్రభుత్వం మే 21 నుంచి జూన్ 21 వరకు రాష్ట్రంలో భారీ ఎత్తున యోగాంధ్ర కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిందని చెప్పారు. వీటిని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. యోగాంధ్ర కార్యక్రమంలో జిల్లా నుంచి సుమారు 8 లక్షలమందిని భాగస్వాములను చేస్తున్నామని తెలిపారు. దీనికోసం ఇప్పటికే గ్రామస్థాయిలో శిక్షణ కార్యక్రమాలను ప్రారంభించామని చెప్పారు. పర్యాటక ప్రదేశాల్లో యోగా కార్యక్రమంలో భాగంగా త్వరలో తాటిపూడి, రామతీర్థంలో కూడా యోగా పదర్శనలు జరుగుతాయని చెప్పారు. సుమారు 5వేల మంది ఉపాధివేతనదారులతో ఈనెల 10న ఎస్.కోటలో భారీ యోగా ప్రదర్శన నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు. ప్రముఖ సైకత శిల్పి హరికృష్ణ రూపొందించిన యోగాంధ్ర సైకత శిల్పం ఆకట్టుకుంది. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ ఎ.కల్యాణచక్రవర్తి, పర్యాటకాధికారి కుమారస్వామి, ఆయుష్ అధికారి డాక్టర్ ఆనందరావు, ఎంపిడిఒ రాధిక, తాహశీల్దార్ తాడ్డి గోవింద, గ్రామ సర్పంచి ముసిలి, ఆయుష్ గురు ఇందుమతి బృందం, ఇతర వైద్యులు, వివిధ శాఖల అధికారులు, ప్రభుత్వ సిబ్బంది, స్థానిక పెద్దలు, వివిధ వర్గాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పిడుగు పడి మహిళ మృతి

ప్రజాశక్తి-తెర్లాం

పిడుగుపడి మహిళ మృతిచెందింది. ఈ సంఘటన మండలంలోని విజయరాంపురం బూరిపేట గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఆ గ్రామానికి చెందిన పూడివలస వెంకటమ్మ (42) శుక్రవారం మధ్యాహ్నం కళ్లంలో పశువులకు దాణా పెట్టడానికి వెళ్లారు. ఆ సమయంలో పిడుగుపడి అక్కడికక్కడే ఆమె మృతిచెందారు. ఆమెకు భర్త రామిరెడ్డి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ విషయం తెలుసుకున్న తహశీల్దార్ జి.హేమంత్‌కుమార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి, వివరాలు సేకరించారు. ఈ ఘటనపై సర్పంచ్ బి.మధుసూదన్ రావు, గ్రామ నాయకులు విచారం వ్యక్తం చేశారు.

కూటమి ప్రభుత్వ కృషితోనే రైల్వేజోన్

టిడిపి జిల్లా అధ్యక్షులు కిమిడి నాగార్జున

ప్రజాశక్తి -చీపురుపల్లి

కూటమి ప్రభుత్వ కృషితోనే విశాఖ రైల్వే జోన్ కల సాకారమైందని టిడిపి జిల్లా అధ్యక్షులు కిమిడి నాగార్జున అన్నారు. చీపురుపల్లిలో తన నివాసంలో శుక్రవారం విలేకర్లతో ఆయన మాట్లాడారు. విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటుకు జిఎంను నియమిస్తూ ఉత్తర్వులు వెలువడటంపై హర్షం వ్యక్తంచేశారు. ఉత్తరాంధ్రపై ఎన్‌డిఎ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి ఇది నిదర్శనమని తెలిపారు. రూ.150 కోట్ల నిధులు కూడా కేటాయింపు చేశారన్నారు. రైల్వే జోన్ ఏర్పాటుతో యువతకు ఉద్యోగ అవకాశాలు వస్తాయని, అవసరమైన ప్రాంతాలకు రైళ్లను నడిపే సౌలభ్యం ఉంటుందని చెప్పారు. రైల్వే స్టేషన్ల అభివృద్ధి, స్టేషన్లో రైళ్ల హాల్టింగ్ సదుపాయం కల్పించడం మెరుగవుతాయని వివరించారు.

కలెక్టర్‌తో విభేదాలు లేవు

ఆయన కూడా కష్టపడి పనిచేస్తున్నారు ● విలేకర్ల సమావేశంలో మంత్రి కొండపల్లి

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లా కలెక్టర్‌తో తనకు ఎటువంటి విభేదాలూ లేవని, ప్రభుత్వ లక్ష్యాలను చేరుకునేందుకు ఆయన కూడా ఎంతో కష్టపడి పనిచేస్తున్నారని రాష్ట్ర ఎంఎస్ఎంఇ, ఎన్నారై వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. తనపై ఎందుకు అలాంటి వ్యాఖ్యలు చేశారో తెలీదని విలేకర్లు అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పారు. తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఏడాదిలో తమ ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు చేసిందని, అయినప్పటికీ ప్రభుత్వంపై వైసిపి నాయకులు చేస్తున్న విమర్శలు సరికాదని అన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని ఎన్నో కష్టాల్లోకి నెట్టిందని విమర్శించారు. అనుభవజ్ఞులైన ముఖ్యమంత్రి రాష్ట్రానికి కావాలన్న ఉద్దేశంతో ప్రజలు టిడిపిని గెలిపించారని అన్నారు. గజపతినగరం ఎమ్మెల్యేగా తనను కూడా ప్రజలు భారీగా మెజార్టీతో గెలిపించారని అన్నారు. రూ.10 లక్షల కోట్ల అప్పుతో తమ ప్రభుత్వ పాలన ప్రారంభమైందన్నారు. ఏడాది కాలంలో చాలా హామీలు అమలు చేశామని అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం చెత్తపన్ను రద్దుచేశామన్నారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ధాన్యం బిల్లులు పెండింగ్ లేకుండా చూశామన్నారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు రూ.8లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని, త్వరలోనే ఎంఎస్ఎంఇ పార్కుల స్థాపనకు కూడా చర్యలు తీసుకుంటామని చెప్పారు. పరిశ్రమలు పెట్టేవారికి సౌకర్యాలు కల్పించడం, సమస్యలు లేకుండా చూడడమే లక్ష్యంగా ప్రణాళిక రూపొందించామన్నారు. అందుకే రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లోనూ ఎంఎస్ఎంఇ పార్కులు ఏర్పాటు చేస్తున్నామని, ఇప్పటికే 11పార్కులను ప్రారంభించామని అన్నారు. సులువుగా అనుమతులు పొందేందుకు వీలుగా సింగిల్ డెస్క్ విధానం అమలు చేస్తున్నామని, త్వరలో పరిశ్రమలు పెట్టేవారికి తగిన సలహాలు, అనుమతులు ఇచ్చేందుకు వీలుగా మండలానికో అధికారిని నియమిస్తామని అన్నారు. త్వరలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు మరింతగా విస్తరిస్తామన్నారు. వైసిపి పాలనలో కేవలం రూ.250 పెంచితే, తాము అధికారంలోకి వచ్చాక రూ.4వేలకు పెంచడంతో పాటు మూడు నెలల బకాయి కూడా ఒకేసారి చెల్లించామన్నారు. మునుపెన్నడూ లేనంతగా 16,500 ఉపాధ్యాయ పోస్టులకు డిఎస్‌సి నోటిఫికేషన్ ఇచ్చామని అన్నారు. గత పాలకులు రోడ్లను దయనీయంగా మారిస్తే.. తాము అధికారం చేపట్టాక దాదాపు 22 వేల కిలోమీటర్ల రోడ్లను కొత్తగా వేస్తున్నామన్నారు. వైసిపి ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్లు మంజూరు చేయకపోవడం వల్ల ఎన్ఆర్ఇజిఎస్ నిధులు నిరుపయోగమయ్యాయని విమర్శించారు. ఏడాదిలో అర్బన్ కేంద్రాల్లో అన్నా క్యాంటీన్లను పునరుద్ధరించామని, త్వరలో మేజర్ పంచాయతీల్లో కూడా క్యాంటీన్లు ఏర్పాటు చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉందని అన్నారు. 'మీపై కలెక్టర్ కామెంట్స్ వెనుక ఆంతర్యం ఏమిటి?' అని విలేకర్లు అడిగిన ప్రశ్నకు మంత్రి స్పందిస్తూ 'అది నాకు తెలియదు అంటూ 'తేల్చి' చెప్పారు.

నిరసన తెలుపుతున్న ఎండిఎం కార్మికులు, సిఐటియు నాయకులు

ఎండిఎం కార్మికుల నిరసన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

బకాయి బిల్లులు, జీతాలు తక్షణం చెల్లించాలని, మెనూ ఛార్జీ విద్యార్థికి రూ.20 పెంచాలని, వర్కర్లకు నెలకు రూ.10వేలు వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం కార్మిక సంఘం (సిఐటియు) ఆధ్వర్యాన కార్మికులు కస్పా హైస్కూలు వద్ద శుక్రవారం మధ్యాహ్నం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ఎ.జగన్మోహన్ మాట్లాడుతూ పిల్లలకు రుచికరమైన వేడివేడి నాణ్యమైన భోజనం అందించేందుకు వర్కర్లకు ట్రైనింగ్ ఇవ్వడం అభినందనీయమని, ప్రస్తుత ధరల్లో పిల్లాడికిచ్చే 5:88 రూపాయలు, 8:57 రూపాయలతో నాణ్యమైన భోజనం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. 2024 అక్టోబర్‌లో మెనూ ఛార్జీలు పెంచినట్లు ప్రకటించి నేటికీ బిల్లులు చెల్లించలేదని అనాగ్ర. ఈనెల 12 నుంచి పాఠశాలలు పున ప్రారంభం కానున్నాయని, ఈ లోగా బిల్లులు, జీతాలు చెల్లించాలని లేదంటే జూన్ 23న కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తామని తెలిపారు. నిరసన వ్యక్తం చేసిన వారిలో పలువురు మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

లోపభూయిష్ట మూల్యాంకణ బాధ్యులపై చర్య తీసుకోవాలి

విజయనగరం టౌన్ : పదో తరగతి మూల్యాంకణాన్ని లోపభూయిష్టంగా నిర్వహించిన వారిపై చర్యలు తీసుకోవాలని వైసిపి విద్యార్థి విభాగం నాయకులు విద్యాశాఖ అధికారులను కోరారు. ఈమేరకు శుక్రవారం డిఇఒ యు.మాణిక్యంనాయుడుకు వినతి అందజేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా టెన్త్ పరీక్షల నిర్వహణలో ఇటు పాలకులు, అటు సంబంధిత విద్యా శాఖ అధికారులు పూర్తిగా విఫలమయ్యారని తెలిపారు. జవాబు పత్రాలను సరిగ్గా దిద్ది, పారదర్శకంగా ఫలితాలు వెల్లడించకుండా ఘోరంగా విఫలమై, విద్యార్థులను వారి తల్లిదండ్రులను అంతులేని మానసిక క్షోభకు గురిచేశారని పేర్కొన్నారు. ఫలితంగా ఇప్పుడు ప్రతి స్టూడెంట్ కూడా తన మార్కుల జాబితాపై అనుమానాలు వ్యక్తం చేసే పరిస్థితిని తీసుకు వచ్చారు. ఈ కారణంగా ట్రిపుల్ ఐటీ, గురుకుల జూనియర్ కాలేజీలు సహా ఇతరత్రా అడ్మిషన్లలో విద్యార్థులు అన్యాయమై పోయిన ఘటనలు వెలుగు చూస్తున్నాయని తెలిపారు. తప్పులకు బాధ్యులైన విద్యాశాఖ మంత్రి లోకేష్‌తో మొదలు అందరిపైనా చర్యలు చేపెట్టాలన్నారు. కార్యక్రమంలో వైసిపి విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు కరుమజ్జి సాయికుమార్, నాయకులు దీరు యాదవ్, బోనుల తరుణ్, తిరుపతి రావు, గణేష్, అశోక్, సాయి, మురళి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి- లక్కవరపుకోట

పంచాయతీ పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యాన ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి కె.సురేష్ మాట్లాడుతూ కార్మికులకు ఆరేడు నెలల వరకు బకాయి జీతాలు చెల్లించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుతున్న గ్రీన్ అంబాసిడర్, పారిశుధ్య కార్మికులకు నెలల తరబడి వేతనాలు చెల్లించకుంటే వారి కుటుంబాల్ని ఎలా పోషించుకుంటారని ప్రశ్నించారు. పారిశుధ్య కార్మికుల జీతాలు గురించి ప్రతి ఆరు నెలలకు ఒకసారి ధర్నా చేయడం ఆనవాయితీగా మారిపోతోందని ఆవేదన వ్యక్తంచేశారు. 15 రోజుల్లో పాత బకాయి జీతాలు ఇవ్వాలని డిమాండ్‌చేశారు. లేకుంటే సమ్మెకు సిద్ధమవుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గాడి అప్పారావు, సిఐటియు నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న పంచాయతీ కార్మికులు, సిఐటియు నాయకులు

శాంతియుతంగా బక్రీద్ నిర్వహించాలి : ఎస్‌పి

ప్రజాశక్తి - కంటోన్మెంట్

ఈనెల 7న బక్రీదు (ఈదుల్ అజ్ హా) పండగను మతసామరస్యానికి ప్రతీకగా కుల, మతాలకు అతీతంగా సోదరభావంతో, శాంతియుతంగా నిర్వహించుకోవాలని ఎస్‌పి వకుల్ జిందల్ తెలిపారు. ముందుగా ముస్లిములకు బక్రీద్ పండగ శుభాకాంక్షలు తెలిపారు. బక్రీద్ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సంబంధిత పోలీసు అధికారులు ముందస్తు భద్రత చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లోని మసీదుల వద్ద ప్రత్యేక ప్రార్ధనలు చేపట్టే అవకాశం ఉన్నందున బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ముఖ్యమైన మసీదుల వద్ద డ్రోన్స్, సిసి కెమెరాలతో నిఘా ఏర్పాటు చేయాలన్నారు. ప్రతీ పోలీసు స్టేషను పరిధిలోని మసీదులను కవర్ చేస్తూ పెట్రోలింగు నిర్వహించాలన్నారు. ముస్లిం-హిందువుల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేలా సామాజిక మాధ్యమాల్లో ప్రచారమయ్యే అసత్య ప్రచారాలను నమ్మవద్దన్నారు. మతాలు, కులాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే వ్యక్తులు లేదా వస్తువులు కనబడితే సమాచారాన్ని డయల్ 112 లేదా స్థానిక పోలీసులకు అందించాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు

పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎస్‌పి వకుల్ జిందాల్ తెలిపారు. పోలీసు కార్యాలయంలో శుక్రవారం వెల్ఫేర్‌డే నిర్వహించారు. సిబ్బంది నుంచి వినతులు స్వీకరించి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టారు.

పెండింగ్ ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిష్కరించాలి

విజయనగరం టౌన్ : పెండింగ్‌లో ఎల్ఆర్ఎస్, బిపిఎస్ దరఖాస్తులు తక్షణమే పరిష్కరించాలని టౌన్ ప్లానింగ్ ఎసిపిలు ఐవి రమణమూర్తి, హరిబాబు ప్లానింగ్ కార్యదర్శులను ఆదేశించారు. శుక్రవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. పెండింగ్ లో ఉన్న సమస్యలను కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ నగర పరిధిలో ఎల్ఆర్ఎస్, బిపిఎస్ దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే పరిష్కరించాలని సూచించారు. నగరంలో ప్రధాన జంక్షన్లలో బడ్డీలు ఎక్కువగా అక్రమంగా పెట్టేస్తున్నారు. అన్ని ప్రాంతాల్లో పర్యటించి వాటిని తొలగించాలని కార్యదర్శులకు ఆదేశించారు. ఆక్రమణల నిర్మూలనకు తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం వార్డులు వారీగా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో టి పిఒ అప్పలరాజు, టిపిఎస్ అనిత పాల్గొన్నారు.

బకాయి వేతనాలు చెల్లించాలి

- శానిటేషన్ వర్కర్స్ యూనియన్ డిమాండ్
- 23న కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న పారిశుధ్య కార్మికుల బకాయి వేతనాలు చెల్లించాలని శానిటేషన్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) నాయకులు ఎ.జగన్మోహనరావు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక కస్పా హైస్కూల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జూన్ 12 తేదీ నుంచి పాఠశాలలు ప్రారంభం కానున్నాయని, విద్యార్థుల ఆరోగ్యంగా ఉండాలంటే పాఠశాలలు పరిశుభ్రంగా ఉంచడంలో శానిటేషన్ వర్కర్స్ పాత్ర కీలకమైనదన్నారు. ప్రభుత్వపాఠశాలలు, కళాశాలల్లో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు బకాయి ఉన్న మూడు నెలల వేతనాలు చెల్లించాలని కోరారు. వేతనాలు ఇవ్వకుండా ఎలా బతుకుతారని ఆయన ప్రశ్నించారు. ఇస్తున్న ఆరు వేలు వేతనం సకాలంలో ఇవ్వకుంటే ఎలా అని ప్రశ్నించారు. పెరుగుతున్న ఆధారాలకు అనుగుణంగా వేతనం పది వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. పిఎఫ్, ఇఎస్ఐ వంటి సౌకర్యాలు కల్పించాలన్నారు. గుర్తింపు కార్డులు, యూనిఫారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలు పరిష్కారం కోసం ఈ నెల 23న కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తామని తెలిపారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకుంటే రాష్ట్ర వ్యాప్త ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాకు అన్ని ప్రభుత్వ హై స్కూల్, కళాశాలల్లో పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్స్ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. విలేకర్ల సమావేశంలో నందిని, పార్వతి, ఉమ, ఆదిలక్ష్మి, లీలావతి, పైడిరాజు పాల్గొన్నారు.

అక్రమంగా స్క్రాప్ తరలింపుపై విజిలెన్స్ దాడులు

కంటోన్మెంట్ : సరైన జిఎస్‌టి బిల్లులు లేకుండా స్క్రాప్‌ను అక్రమంగా రవాణా చేస్తున్నట్టు విజిలెన్సు ప్రాంతీయ నిఘాఅధికారి బి. ప్రసాదరావుకు వచ్చిన సమాచారం మేరకు శుక్రవారం భోగాపురం మండలం, నాతవలస టోల్ గేట్ దగ్గర విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేసి స్క్రాప్‌లోడుతో వెళుతున్న వాహనాన్ని పట్టుకున్నారు. ఆ స్క్రాప్‌ను ఇచ్ఛాపురంలో లోడు చేసి హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు గుర్తించారు. దానికి సంబంధించిన వే బిల్లు, టాక్సు ఇన్వాయిస్‌లను పరిశీలించి అనుమానంతో జిఎస్‌టి అధికారులకు చర్య నిమిత్తం అప్పగించారు. గతనెల 31న కూడా వాహన తనిఖీలలో పలాస నుండి హైదరాబాద్ నకు రవాణా చేస్తూ స్క్రాప్ లారీ పట్టుబడింది. ఈ తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు, సింహాచలం, రవి ప్రసాద్, సతీష్ కుమార్ , జిఎస్‌టి అధికారులు ఉమాశంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న వ్యకాస నాయకులు, కూలీలు

200 రోజులు ఉపాధి కల్పించాలి

ప్రజాశక్తి-శృంగవరపుకోట

జాబ్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికీ ఏడాదిలో 200 రోజులు పని కల్పించాలని, రోజు కూలి రూ.600 వచ్చేలా చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గాడి అప్పారావు, సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ డిమాండ్ చేశారు. మండలంలోని కిల్తంపాలెం రెవెన్యూ పరిధిలో మామిడివానిబందలో వ్యకాస ఆధ్వర్యంలో ఉపాధి వేతన దారులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బకాయి బిల్లులు, తట్ట, గునపాం, పార, మంచినీరు, ట్రాన్స్‌పోర్టు ఛార్జీలు తదితర వేసవి అలవెన్సులు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాకి దేవుడమ్మ, లగుడు లక్ష్మి, కుమ్మరి పొట్టమ్మ, కమలపల్లి సత్యవతి, బంధం లక్ష్మి, కాకి మేరి పాల్గొన్నారు.

తైక్వాండోలో బొబ్బిలి క్రీడాకారులకు పతకాలు

ప్రజాశక్తి-బొబ్బిలి

జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో బొబ్బిలి క్రీడాకారులు సత్తాచాటారు. ఒడిశా రాష్ట్రంలోని కటక్‌లో మే 30, 31, జూన్ 1న జాతీయ స్థాయి తైక్వాండో పోటీలు జరిగాయి. పోటీలలో బొబ్బిలి ప్రాంతానికి చెందిన 17 మంది క్రీడాకారులు బంగారు, వెండి, కాంస్య పతకాలు సాధించారు. వంజరాపు భరత్ కుమార్, పోతాబత్తుల జ్ఞాన దీపక్, షేక్ అబ్దుల్లా బంగారు పతకాలు, తాళ్ల లిఖిత రావు, రంభ వెంకటక్రితిన్, గెంబలి కిన్నరేష్, రెడ్డి సృజన, చిరివెళ్ల నాగార్జున వెండి, కర్రి శరవన్ చరణ్, షేక్ అహ్మద్, తాళ్ల తస్విక్ రావు, కడియాల ప్రిన్స్‌బాబు, ఎ.సూర్య శశాంక్, రెడ్డి శృతికీర్తన, చిరివెళ్ల చాణక్య, మన్నేల శ్రీకర్ యాదవ్, కొండపల్లి ప్రణవ్ కాంస్య పతకాలు సాధించారు. వీరిని కోటలో ఎమ్మెల్యే బేబినాయన, డిఎస్‌పి భవ్యరెడ్డి అభినందించారు. కార్యక్రమంలో కోచ్ సుధాకర్, అభ్యుదయ విద్యాసంస్థల ప్రిన్సిపల్ చింతా శారద పాల్గొన్నారు.

ఆర్‌డి రవీంద్రతో మాట్లాడుతున్న చైర్మన్ శరత్

మున్సిపాలిటీకి ప్రాధాన్యత ఇవ్వాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

బొబ్బిలి మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని చైర్మన్ రాంబార్కి శరత్... మున్సిపల్ ఆర్‌డి రవీంద్రను కోరారు. మున్సిపల్ కార్యాలయాన్ని శుక్రవారం ఆర్‌డి రవీంద్ర సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన్ను చైర్మన్ శరత్ కలిశారు. మున్సిపాలిటీని అభివృద్ధి చేసేందుకు పాలకవర్గంతో అధికారులు సమన్వయంతో పని చేయాలని శరత్ కోరారు. మున్సిపాలిటీ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తామని ఆర్‌డి రవీంద్ర తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీలో ఘనంగా ఎనాఫెస్ట్

ప్రజాశక్తి-విజయనగరంకోట

ప్రభుత్వ వైద్యకళాశాల ఎనాటమీ విభాగంలో శుక్రవారం ఎనాఫెస్ట వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పద్మలీల ముఖ్యఅతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. మెడికల్ విద్యార్థులు ఆయాన విభాగానికి సంబంధించి పాఠ్యాంశాలుగా ఉన్న శరీర భాగాలను పెయింట్స్ ద్వారా ప్రదర్శించారు. హిస్టాలజీ రంగోలి, మోడల్స్ ప్రదర్శించారు. అనాటమీ విభాగ అధిపతి డాక్టర్ ఎ.వాసంతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విశాఖపట్నం ఆంధ్ర మెడికల్‌కాలేజి అనాటమీ విభాగాధిపతి డాక్టర్ రవీంధ్ర కిశోర్, స్థానిక ప్రభుత్వ కళాశాల బయో కెమిస్ట్రీ డాక్టర్ ప్రేమ్‌కుమార్,డాక్టర్ శైలజ, డాక్టర్ సోమేశ్వరరావు, డాక్టర్ శిరీష, డాక్టర్ రోజారాణి, డాక్టర్ హరిప్రద, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

30లోగా వడ్డీ లేకుండా పన్ను చెల్లింపు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

2025-26 మొదటి అర్థ సంవత్సరపు ఆస్తి, ఖాళీ స్థలాల పన్నుల చెల్లింపులను ఈనెల 30 లోగా వడ్డీ లేకుండా చెల్లించుకోవచ్చునని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఒక ప్రకటనలో తెలిపారు. లేని ఎడల జూలై 1 నుంచి ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించిన వడ్డీ మొత్తాన్ని చెల్లించుకోవాల్సి వస్తుందని తెలిపారు. ఆస్తి పన్నుదారులు పై విషయాన్ని గమనించి, పన్నులు చెల్లించి, వడ్డీ మాఫీ అవకాశాన్ని పొందాలన్నారు.

అత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి

ప్రజాశక్తి-శృంగవరపుకోట

అనంతపురం జిల్లా రామగిరి ప్రాంతంలో దళిత బాలికపై అత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని దళిత బహుజన శ్రామిక యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి జయశంకర్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బాలికను ఆరు నెలలుగా అత్యాచారం చేయడమే కాకుండా వీడియో తీసి బెదిరించడం క్షమించరాని చర్యని పేర్కొన్నారు. దళిత, గిరిజనులపై రాష్ట్రంలో వరుస అఘాయిత్యాలు జరుగుతున్నాయని, ఇందులో నిందితులు అధికార పార్టీ వారు కావడం చాలా బాధాకరమైన విషయమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

రోడ్లపై వర్షపునీరు లేకుండా చర్యలు

ప్రజాశక్తి-బొబ్బిలి

రోడ్లపై వర్షపునీరు నిల్వ లేకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి అధికారులను ఆదేశించారు. పట్టణంలోని ఆర్‌టిసి కాంప్లెక్స్, నాయుడు కాలనీ, రైల్వే ఫ్లై ఓవర్ ప్రాంతాల్లో శుక్రవారం పారిశుధ్య పనులను ఆమె పరిశీలించారు. వర్షాలు విస్తారంగా కురవడంతో రోడ్లపై నీరు నిల్వ ఉంటే వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడతారని చెప్పారు. నీరు నిల్వ లేకుండా చూడాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళీని ఆదేశించారు.

నేడు విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి - గజపతినగరం రూరల్

గజపతినగరం వ్యవసాయ మార్కెట్ యార్డు వద్ద మంత్రి కొండపల్లి శ్రీనివాస్ శనివారం రైతులకు విత్తనాలు, డ్రోన్లు పంపిణీ చేయనున్నారని ఎడి కె.మహారాజన్ తెలిపారు. రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సిహెచ్‌డబ్ల్యులకు శిక్షణ

వేపాడ : స్థానిక ఎంఇఒ కార్యాలయంలో శుక్రవారం సిహెచ్ వర్కర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంఇఒ పి.బాలభాస్కరరావు మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం అమలుపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సిఆర్‌పిలు పాల్గొన్నారు.

వెంకటేశ్వరస్వామి ఆలయం ప్రారంభం

ప్రజాశక్తి-డెంకాడ

మండలంలోని గుణుపూరుపేటలో శుక్రవారం వైభవ వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రారంభోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు పాల్గొని, పూజలు చేశారు. కార్యక్రమంలో నెల్లిమర్ల జెడ్‌పిటిసి జి.సన్యాసి నాయుడు, వైస్ ఎంపిపి పతివాడ సత్యనారాయణ, చనమళ్ల తులసి, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు అంతరాయం

నెల్లిమర్ల : సతివాడ, రామతీర్థం సబ్ స్టేషన్ల పరిధిలో శనివారం విద్యుత్తు అంతరాయం కలుగుతుందని విజయనగరం పట్టణ డిఇఇ పి.త్రినాథరావు తెలిపారు. వ్యవసాయ కనెక్షన్లు, చెట్లు తొలగించడం, సాంకేతిక సమస్యల పరిష్కారం కోసం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరాను నిలిపేస్తున్నట్లు చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

కాలం విలువ తెలుసుకోవాలి

వేసవి శిక్షణ శిబిరం ముగింపులో డిపిఆర్‌ఒ రమేష్

ప్రజాశక్తి-విజయనగరంకోట

ప్రతి ఒక్కరూ సమయం, కాలం విలువ తెలుసుకోవాలని జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి డి. రమేష్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. కేంద్ర గ్రంథాలయంలో ఏప్రిల్ 28 నుంచి జూన్ 6 వరకు 40 రోజుల పాటు విద్యార్థులకు వివిధ అంశాలపై వేసవి శిక్షణ శిబిరం నిర్వహించారు.ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో డి.రమేష్ మాట్లాడుతూ దేశ నాయకుల చరిత్రలను, వారి అనుభవాలను తెలుసుకోవాలని విద్యార్థులకు సూచించారు. వారిని స్ఫూర్తిగా తీసుకొని భవిష్యతుత్లఓ ముందుకువెళ్లాలని అన్నారు. గ్రంథాలయ కార్యదర్శి బి.లక్ష్మి మాట్లాడుతూ ఈ వేసవి శిక్షణ శిబిరంలోనే కాకుండా ప్రతి ఆదివారం గ్రంథాలయంలో విద్యార్థులకు వారికి అవసరమైన విషయాలపై బోధించడం జరుగుతుందన్నారు ప్రతి ఆదివారంతో పాటు సెలవుల్లో కూడా గ్రంథాలయాలను సందర్శించాలని తెలిపారు. మాజీ కౌన్సిలర్ మేక అనంతలక్ష్మి మాట్లాడుతూ చరవాణులకు దూరంగా ఉండి పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని సూచించారు. కొందరు విద్యార్థులు వేసవి విజ్ఞాన శిబిరంలో నేర్చుకున్న అంశాలపై ప్రసంగించారు. వ్యాసరచన, చిత్రలేఖనం, క్విజ్, ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ముఖ్య అతిథులు చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్స్ అయిన ఇ.సన్యాసిరావు, ఈశ్వర్, భాష, షణ్ముఖప్రియ, రవూఫ్, గ్రంథాలయ సిబ్బంది , విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలతోనే విజ్ఞానం

గ్రంథాలయాల్లో విజ్ఞానం పుస్తక రూపంలో ఉంటుందని తెలుగు భాషా సేవాసంఘం అధ్యక్షులు ఆర్‌బి రామానాయుడు అన్నారు శుక్రవారం గాజులరేగ గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరాలు ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. వేసవి శిక్షణ శిబిరాలు విద్యార్థులకు ఎంతగానో తోడ్పడతాయన్నారు. మరో ముఖ్య అతిథి నారాయణ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ మొయిద నారాయణరావు మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాల్లో పుస్తకాలను చదవడం ద్వారా ఎంతో జ్ఞానాన్ని సంపాదించుకోవచ్చు అన్నారు. రిటైర్ టీచర్ జి సూర్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాలతో నిత్యం సత్సంబంధాలు ఉండాలన్నారు. శాఖ గ్రంథాలయ అధికారి ఎం.లక్ష్మణరావు మాట్లాడుతూ ఈ 40 రోజులు పాటు నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరాల్లో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారని తెలిపారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు.

తెర్లాం : స్థానిక శాఖా గ్రంథాలయంలో ఏర్పాటుచేసిన వేసవి విజ్ఞాన శిబిరం శుక్రవారం ముగిసింది. 40 రోజులపాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన శిబిరం విద్యార్థులకు ఎంతో విజ్ఞానాన్ని అందించిందని ఎంఇఒ-2 పాపారావు తెలిపారు. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో శాఖా గ్రంథాలయ అధికారి సిహెచ్.కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

వేపాడ : స్థానిక శాఖా గ్రంథాలయంలో ఏర్పాటుచేసిన వేసవి శిక్షణ శిబిరం ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

డెంకాడ : స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

విజయనగరంకోట.. జిల్లా గ్రంథాలయంలో మాట్లాడుతున్న డిపిఆర్‌ఒ రమేష్

డెంకాడ, తెర్లాం, వేపాడలో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న అతిథులు, గ్రంథాలయాధికారులు

నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులు, కార్మికులు

లేబర్‌కోడ్‌లు అమలు చేయొద్దు

సిఐటియు ఆధ్వర్యాన నిరసన

ప్రజాశక్తి-బొబ్బిలి

8 గంటల పనిదినాన్ని 12 గంటలకు మారుస్తూ రాష్ట్ర మంత్రివర్గం చేసిన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని శుక్రవారం సిఐటియు ఆధ్వర్యాన స్థానిక కోరాడవీధి కూడలిలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు మాట్లాడుతూ కేంద్రంలో మోడీ ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్ల అమల్లో భాగంగా కార్మిక చట్టాలను మారుస్తూ రాష్ట్ర కేబినెట్ నిర్ణయం తీసుకోవడం దుర్మార్గమని అన్నారు. ఒకవైపు ధరలు పెరిగి, శ్రామికుల జీవన ప్రమాణాలు పడిపోతున్నాయని చెప్పారు. ఈ స్థితిలో పనిగంటలు తగ్గించి అదనపు ఉపాధిని కల్పించాల్సింది పోయి నిరుద్యోగాన్ని పెంచే ఈ చర్య అభివృద్ధి నిరోధకమన్నారు. లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా జులై 9న చేపట్టే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ అధ్యక్షులు జి.గౌరీష్, రామారావు, యుగంధర్, వెంకటి, జి.శంకర్రావు, కార్మికులు పాల్గొన్నారు.

జీవనశైలి మార్పునకు యోగా దోహదం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

యోగాసనాలు వేస్తున్న కమిషనర్ నల్లనయ్య, అధికారులు, విద్యార్థులు

మనిషి జీవనశైలి మార్పునకు, సంపూర్ణ ఆరోగ్యానికి యోగ ఎంతో దోహదపడుతుందనినగర పాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రింగ్ రోడ్డు వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద యోగాసనాల కార్యక్రమాలు జరిగాయి. యోగా శిక్షకులు ఎస్‌వి కృష్ణారెడ్డి అందరితో యోగాసనాలు వేయించారు. అనంతరం యోగా పట్ల ప్రజలకు మరింత చైతన్య పరిచే దిశగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మే 21 నుండి జూన్ 21 వరకు నెలరోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా యోగాంధ్ర కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. నగరంలోని అనేక చోట్ల యోగాసనాలు వేయించి ప్రజలలో అవగాహన తీసుకొస్తున్నామన్నారు. యోగా చేయడంవల్ల ఆరోగ్యానికి ఎంతోమేలు చేకూరుతుందన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. సచివాలయాల పరిధిలో అన్ని వర్గాల వారితో యోగాసనాలు చేయించి యోగపట్ల ఆకర్షితులయ్యే కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ హరిబాబు, సిటీ మిషన్ మేనేజర్ సన్యాసిరావు, బాల బాలికలు, డ్వాక్రా సంఘం మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

శుక్రవారం స్థానిక రాజీవ్ స్టేడియం లో బాలబాలికలకు స్కిట్, రోల్‌ప్లే సంబంధించి సచివాలయాల పరిధిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఎంపిక చేసిన వారితో పోటీలు నిర్వహించి, వారి నుంచి అర్బన్ స్థాయి లో 1,2,3 కేటగిరీలో ఎంపిక చేశారు. అర్బన్ స్థాయిలో ఉత్తమప్రతిభ కనబరిచిన వారిని జిల్లా స్థాయి పోటీలకు పంపుతామని సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు తెలిపారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ సీనియర్ అసిస్టెంట్, ఆర్‌ఐలు, పీడీలు, పిఇటిలు, యోగా శిక్షకులు, సచివాలయ అడ్మిన్ కార్యదర్శులు పాల్గొన్నారు.

జిఎం నియామకం తొలి అడుగు

మార్క్‌ఫెడ్ చైర్మన్ బంగార్రాజు

ప్రజాశక్తి -పూసపాటిరేగ

మాట్లాడుతున్న మార్క్‌ఫెడ్ చైర్మన్ బంగార్రాజు

విశాఖ రైల్వే జోన్ ఏర్పాటు దిశగా జనరల్ మేనేజర్‌గా సందీప్ మాథుర్‌ను నియమించడం ద్వారా అభివృద్ధికి కీలక అడుగు పడిందని మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు తెలిపారు. పూసపాటిరేగలోని టిడిపి కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షులు మహంతి శంకరరావు ఆధ్వర్యంలో శుక్రవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బంగార్రాజు, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మహంతి చిన్నంనాయుడు మాట్లాడారు. రాష్ట్ర ప్రజల చిరకాల కోరిక అయిన ప్రత్యేక రైల్వే జోన్‌కు ఉన్నతాధికారి నియామకం జరగడం అభినందనీయమన్నారు. విశాఖపట్నం కేంద్రంగా ఈ జోన్ ఏర్పడడం రాష్ట్రానికి ప్రయోజనాలను తీసుకురాబోతుందని అభిప్రాయపడ్డారు. త్వరలో గెజిట్ నోటిఫికేషన్ కూడా జారీ కానుందని విశాఖ ఎంపి భరత్ ప్రకటించారన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఆకిరి ప్రసాదరావు, పిన్నింటి సన్యాసినాయుడు, పిన్నింటి శ్రీనివాసరావు, దంగా భూలోక, రౌతు స్వామి నాయుడు, సామంతుల సోంబాబు, లంకలపల్లి శ్రీనివాసరావు, పిన్నింటి లక్ష్మునాయుడు, పిడిఎ ప్రసాద్, చందక ఆనంద్ పాల్గొన్నారు.

యోగా కార్యక్రమానికి సమాచారం లేదు

చింతపల్లి తీరంలో శుక్రవారం జిల్లా స్థాయిలో ఏర్పాటుచేసిన యోగా కార్యక్రమానికి మండలంలోని టిడిపి నేతలకు అధికారులు సమాచారం ఇవ్వలేదని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మహంతి చిన్నంనాయుడు అసంతృప్తి వ్యక్తం చేశారు. కలెక్టర్ పాల్గొనే కార్యక్రమాలకు సమాచారం ఇవ్వకపోవడం విచారకరమన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలకు ప్రజలు, ప్రజాప్రతినిధులు కలిస్తే అది మరింత దిగ్విజయంగా జరుగుతుందన్నారు. గుట్టుచప్పుడు కాకుండా అధికారులు ఎందుకు ఇలా చేశారో అర్థం కాలేదన్నారు. మండలంలో జరిగే కార్యక్రమంలో నాయకులకు సమాచారం ఇవ్వకపోవడం విచారకరమని మార్క్‌ఫెడ్ చైర్మన్ బంగార్రాజు అన్నారు. గతంలో ఇలా ఉండేది కాదని, ప్రభుత్వ కార్యక్రమాలకు అధికారులు సమాచారం ఇవ్వాలని కోరారు.

160 గుండె ఆపరేషన్లు విజయవంతం

వెంకటరామా ఆస్పత్రి ఎమ్‌డి డాక్టర్ చిట్టి రమణారావు

ప్రజాశక్తి-విజయనగరంకోట

వైద్యులతో కలిసి కేక్ కట్ చేస్తున్న ఎమ్‌డి చిట్టి రమణారావు

ఒకే నెలలో 160 గుండె ఆపరేషన్లు విజయవంతంగా పూర్తి చేసినట్లు వెంకట రామ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ చిట్టి రమణారావు తెలిపారు. శుక్రవారం హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఈ సందర్భంగా కేక్ కట్ చేసి డాక్టర్లకు అభినందనలు తెలిపారు. అనంతరం డాక్టర్ రమణారావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండేలా హాస్పిటల్‌ను ఏర్పాటు చేసి తక్కువ ఖర్చుతో ఆపరేషన్లను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆస్పత్రిలోని వైష్ణవ్ హార్ట్ కేర్ సెంటర్ లో కార్డియాలజీ డాక్టర్ ఆదిత్య నృశేన్, డాక్టర్ గౌరీ శంకర్‌రెడ్డి, డాక్టర్ సుజిత్‌కుమార్, మత్తు వైద్యులు మహేష్ సారధ్యంలో మే నెలలో విజయవంతంగా 100శాతం సెక్సెస్‌తో 160ఆపరేషన్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వైద్యులకు ఆయన అభినందనలు తెలిపారు.కీర్తి శేషులు శ్రీ వైష్ణవ్ పేరు మీదుగా జిల్లాలో ఉండే పేద, మధ్యతరగతి ప్రజలకు తక్కువ ఖర్చుతో ఆరోగ్యశ్రీ, ఇతర బీమాల ద్వారా గుండె, ఇతర శస్త్రచికిత్సలతో పాటు కంటి ఆపరేషన్లు అందుబాటులోకి తీసుకొచ్చి మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నామని తెలిపారు. అన్ని విధాలా తమకు సహకరిస్తున్న వైద్యులకు, ఆస్పత్రికి సిబ్బందికి, ప్రజలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మార్కెటింగ్ మేనేజర్ పిళ్లా హరీష్, కేథ్‌ల్యాబ్ ఇన్‌ఛార్జి సత్యనారాయణ, హాస్పిటల్ సిబ్బంది సీతారాం, అప్పలనాయుడు, కృష్ణ, సాగర్, ఆదినారాయణ పాల్గొన్నారు.

పరిశ్రమల యజమానులు సామాజిక కార్యక్రమాలు చేయాలి

ఎమ్మెల్యే బేబినాయన

ప్రజాశక్తి-బొబ్బిలి

శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే, బుడా చైర్మన్

పరిశ్రమల యజమానులు ప్రజాప్రయోజనాల కోసం సామాజిక కార్యక్రమాలు చెయ్యాలని ఎమ్మెల్యే బేబినాయన కోరారు. హిరా మెల్ట్‌స్ పరిశ్రమ సహకారంతో ఇందిరమ్మ కాలనీలో నిర్మించిన కమ్యూనిటీ భవనాన్ని శుక్రవారం ఎమ్మెల్యే బేబినాయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రజల అవసరార్థం ఇలాంటి కార్యక్రమాలను కర్మాగార యజమానులు చేపట్టడం అభినందనీయమన్నారు. ఈ విషయంలో బొబ్బిలి గ్రోత్ సెంటర్‌లో ఉన్న హిరా మెల్ట్‌స్ కర్మాగారం ముందు వరుసలో ఉందన్నారు. ఇందిరమ్మ కాలనీ వెనుకబడిన ప్రాంతమని, ఈ ప్రాంతంలో ఇలాంటి కార్యక్రమం చేపట్టడం పట్ల హిరా కంపెనీని ఆయన అభినందించారు. అనంతరం కమ్యూనిటి హెల్త్ సెంటర్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆర్.శరత్ కుమార్, టిడిపి పట్టణ అధ్యక్షులు జి.శ్రీనివాసరావు, మండల అధ్యక్షులు వి.సత్యనారాయణ, హిరా పరిశ్రమ ఇడి అశోక్ కుమార్ దాస్, హెచ్‌ఆర్ పి.శ్రీనివాసరావు, శర్మ పాల్గొన్నారు.

యుహెచ్‌సిలో తనిఖీలు

స్థానిక ఇందిరమ్మ కాలనీలో ఉన్న పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని ఎమ్మెల్యే బేబినాయన తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న వైద్య సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రికి వస్తున్న రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఆయనతో బుడా చైర్మన్ తెంటు రాజా, బిజెపి నియోజకవర్గ కన్వీనర్ ఎం.రామారావునాయుడు ఉన్నారు.

బెల్లం తయారీ యూనిట్‌కు శంకుస్థాపన

బాడంగి : బాడంగిలో మినీ బెల్లం తయారీ యూనిట్‌కు శుక్రవారం ఎమ్మెల్యే బేబినాయన, బుడా చైర్మన్ తెంటు లక్ష్మునాయుడు శంకుస్థాపన చేశారు. దీక్షా మహిళా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో పిఎంఎఫ్‌ఎంఇ స్కీమ్ ద్వారా దీన్ని నిర్మిస్తున్నారు. రైతుల వద్ద చెరకు సేకరించి, ఎటువంటి రసాయనాలూ ఉపయోగించకుండా బెల్లం తయారు చేస్తారని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో డిడిఎం టి.నాగార్జున, డిసిసిబి జిఎం సత్యనారాయణ, ఎఆర్‌ఎస్ సీనియర్ శాస్త్రవేత్త పాత్రో, నాబార్డు డిడిఎం దినేష్ కుమార్, జట్టు ఎఫ్‌పిఒ డైరెక్టర్ సత్యం, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-నెల్లిమర్ల

మండలంలోని తంగుడుబిల్లి గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల శస్త్రచికిత్స చేసుకున్న ఏలూరు నారాయణ స్వామికి శుక్రవారం ఉత్తరాంధ్ర స్నేహాంజలి హెల్పింగ్ ఫర్ పూర్ సంస్థ రూ.10 వేలు అందజేసింది. కార్యక్రమంలో స్నేహాంజలి సంస్థ సభ్యులు, ఎంపిటిసి చందక చిన్నంనాయుడు , మాధవ్ మాస్టారు, బట్టాన కృష్ణ, రెడ్డి ప్రకాశ్ పాల్గొన్నారు.

వేపాడ : ఇటీవల శస్త్రచికిత్స చేసుకున్న వేపాడ గ్రామ పురోహితులు ఎ.గోపికి మన వేపాడ- మన నేస్తం సంస్థ సభ్యులు రూ.10,500 ఆర్థిక సాయం అందజేశారు.

ఓటర్ల సమస్యలపై వినతి

ప్రజాశక్తి-భోగాపురం


రిటర్నింగ్ అధికారికి వినతి అందజేస్తున్న ఉప్పాడ

పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల సమస్యలను పరిష్కరించాలని వైసిపి మండల అధ్యక్షులు ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి.. శుక్రవారం రిటర్నింగ్ అధికారికి వినతి పత్రం అందజేశారు. సవరవల్లి పంచాయతీ పరిధిలో మూడు పోలింగ్ కేంద్రాలు ఉండగా, 222 పోలింగ్ కేంద్రంలో ఎక్కువ ఓట్లు ఉండటంతో రాత్రి పది గంటల వరకు ఓట్లు వేయాల్సిన పరిస్థితి ఉందని తెలిపారు. అందుకు మూడు పోలింగ్ కేంద్రాల్లో సమానంగా ఓటర్లను సర్దుబాటు చేయాలని కోరారు. ముంజేరు పంచాయతీ జగ్గయ్యపేట చెందిన ఓటర్లు ఏడు కిలోమీటర్లు దూరంలో ఉన్న చాకివలసలో ఓటు వేస్తున్నారని చెప్పారు. జగ్గయ్యపేటలో కొత్త పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. గుడివాడ పంచాయతీ పరిధిలోని రెండు పోలింగ్ కేంద్రాలు ఒకే పాఠశాలలో ఉన్నాయని, ఇక్కడ ఇరుకుగా ఉండటంతో ఓటింగ్ సమయంలో తోపులాటలు, గొడవలు జరుగుతున్నాయని వివరించారు. ఈ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆయన వినతి పత్రం అందజేశారు.

నేరాలు ఘోరాలు

పాముకాటుతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-తెర్లాం

లక్ష్మణనాయుడు (ఫైల్)

మండలంలోని బొంగుపేట గ్రామానికి చెందిన ఏగిరెడ్డి లక్ష్మణనాయుడు (59) పాముకాటుతో మృతిచెందారు. ఎస్ఐ సాగర్ బాబు కథనం ప్రకారం.. బొంగుపేటలో బుధవారం సాయంత్రం లక్ష్మణనాయుడు తన పశువుల శాల వైపు బహిర్భూమికి వెళ్ళినప్పుడు పాముకాటేసింది. ఈ విషయం గమనించలేదు. అనంతరం పశువుల శాలలో రాత్రి నిద్రపోయాడు. గురువారం ఉదయం ఎప్పటికీ నిద్రలేవక పోవడంతో కుటుంబ సభ్యులు చూశారు. పాము కరిసిందని గమనించి, తెర్లాంలోని పిహెచ్‌సికి తరలించారు. అక్కడి నుంచి రాజాం, అనంతరం శ్రీకాకుళం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శుక్రవారం ఆయన మరణించాడు. లక్ష్మణనాయుడు కుమారుడు ప్రతాప్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సాగర్‌బాబు తెలిపారు.

యువతి అదృశ్యం

ప్రజాశక్తి- కంటోన్మెంట్

నగరంలోని విటి అగ్రహారం బిసి కాలనీకి చెందిన యువతి అదృశ్యమైనట్లు విజయనగరం రూరల్ పోలీసు స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. రూరల్ పోలీసుల కథనం ప్రకారం విజయనగరం బిసి కాలనీలో నాగమణి కుటుంబ సభ్యులు నివాసం ఉంటున్నారు. నాగమణి కుమార్తె ఎ.ధనలక్ష్మి ఈ నెల 3న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు, బంధువులు చుట్టు పక్కల పరిసర ప్రాంతాల్లో వెతికినప్పటికీ ధనలక్ష్మి కనిపించలేదు. దీంతో శుక్రవారం విజయనగరం రూరల్ పోలీసు స్టేషన్‌లో యువతి తల్లి నాగమణి ఫిర్యాదు చేసింది. రూరల్ ఎస్ఐ వి.అశోక్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గ్యాస్ లీకై ఇల్లు దగ్ధం

ప్రజాశక్తి-భోగాపురం

గ్యాస్ లీకై మంటలు చెలరేగి ఇల్లు మొత్తం దగ్ధమైంది. ఈ సంఘటన మండలంలోని తూడెం గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఆ గ్రామానికి చెందిన నీలాపు ఆదమ్మ వంట చేసేందుకు గ్యాస్ ఆన్ చేయగా ఒక్కసారి మంటలు చెలరేగాయి. ఇంట్లో ఉన్న రూ.75 వేలు నగదుతో పాటు వస్తువులన్నీ కాలిపోయాయి. వైకాపా నాయకులు గాలి రాజారెడ్డి బాధితులను పరామర్శించి నిత్యావసర వస్తువులతో పాటు 5వేలు నగదును అందజేశారు.